



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



- పాదగయలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు
- పదిరోజులపాటు ఉత్సవాలు
- భారీగా తరలి రానున్న భక్తులు

పిఠాపురం, అక్టోబరు 2: దక్షిణ కాశీగా, శక్తి పీఠంగా ప్రసిద్ధి గాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రం దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. ఈ ఉత్సవాలకు అమ్మవార్ల దర్శనం, కుంకుమ పూజలు నిర్వహించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ అధికారులు అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి చెంతన ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, అష్టాదశశక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠానికి అధిష్టాన దేవతైన పుర్హుతికాఅమ్మవార్ల శరన్నవరాత్ర, శతచండీ యాగ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 12 వరకూ పదిరోజులపాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. దసరా నవరాత్రుల్లో రాజరాజేశ్వరి అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. నవరాత్రుల్లో ప్రతిరోజూ మహాగణపతిస్వామికి విఘ్నేశ్వరపూజ, దత్తాత్రేయస్వామి, కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రాతఃకాల విశేష సహస్ర నామార్చన, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం సామూహిక విశేష కుంకుమార్చనలు, సాయంకాల ప్రత్యేకార్చనలు, మహానివేదన, చతుర్వేద స్వస్తి జరుగుతాయి. పుర్హుతికాఅమ్మవారి శతచండీయాగంలో భాగంగా ప్రతిరోజూ విఘ్నేశ్వరపూజ, శతచండీయాగ సంకల్పం, చండీపారాయణలు, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చన, స్వాములకు అభిషేకాలు, పుర్హుతికాఅమ్మవారికి శ్రీచక్ర నవావరణార్చన సహిత ప్రత్యేక సహస్ర పుష్పార్చనలు, శ్రీచక్ర లక్షకుంకుమార్చన, చండీయాగం, సాయంకాల సహస్ర పుష్పార్చనలు జరుగుతాయి. 12వ తేది మధ్యాహ్నం మహాపూర్ణాహుతి జరుగుతుంది.

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు: పి.విశ్వనాథరాజు, ఈవో పాదగయ

పాదగయలో ఏటా దసరా సమయంలో జరిగే శరన్నవరాత్ర, శతచండీ యాగ మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దర్శనాలు, కుంకుమ పూజలు నిమిత్తం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, సులభతరంగా దర్శనాలు అయ్యేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా పదిరోజులు అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేస్తారని తెలిపారు. ఉత్సవాల సమయంలో పాదగయను దర్శించుకుని స్వామి,అమ్మవార్ల కృపను పొందాలని కోరారు.

అమ్మవార్ల అలంకారాలు ఇలా

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరీ అమ్మవారికి ప్రతిరోజూ ఒక అలంకారం చేస్తారు. 3న రాజరాజేశ్వరీ అలంకారం, 4న బాలాత్రిపురసుందరీ అలంకారం, 5న అన్నపూర్ణాదేవి అలంకారం, 6న గాయత్రిదేవి అలంకారం, 7న లక్ష్మీదేవి అలంకారం, 8న కాళికాదేవి అలంకారం, 9న సరస్వతిదేవి అలంకారం, 10న దుర్గాదేవి అలంకారం, 11న మహిషాసురమర్దిని అలంకారం, 12న విజయదశమి రోజున విజయదుర్గాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. విజయదశమి పర్వదినాన రాత్రి 7గంటల నుంచి పాదగయ పుష్కరిణిలో హంస వాహనంపై అమ్మవార్ల తెప్పోత్సవం జరుగుతుంది.

మహాత్ముడికి కలెక్టర్ నివాళులు

- లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటానికి పుష్పాంజలి

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 2: సత్యం, అహింస అస్త్రాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ అని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని గాంధీ విగ్రహానికి బుధవారం ఆయన పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ ఎన్నో పోరాటాలు సాగించారన్నారు. ప్రధానంగా సత్యం, అహింస అస్త్రాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప మహనీయుడు జాతిపిత మహాత్మగాంధీ అన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, డీఆర్వో తిప్పేనాయక్, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

చెత్తపన్ను రద్దుపై.. హర్షాతిరేకాలు



- నగరవాసులపై నెలకు తొలగిన భారం రూ.57లక్షలు
- వైసీపీ హయాంలో ఇంటికి రూ.60-రూ.90 వసూలు
- ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత
- అధికారంలోకి వస్తే యూజర్ చార్జీలు రద్దు చేస్తామన్న టీడీపీ అధినేత
- హామీ నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 2: చెత్త పన్ను రద్దు.. ఈ ప్రకటనపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధించిన చెత్త పన్ను నుంచి జిల్లా ప్రజలకు ఉపశమనం లభించింది. చెత్త సేకరణకు ప్రజల నుంచి వసూలు చేసిన యూజర్ చార్జీలను రద్దు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు తాజాగా బుధవారం ప్రకటించారు.

నగరవాసులపై తగ్గిన భారం

చెత్తపన్ను రద్దు ప్రకటనతో కాకినాడ కార్పొరేషన్‌తోపాటు మున్సిపాల్టీల పరిధిలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో కాకినాడ నగరవాసులపై ప్రతినెల రూ.57లక్షల భారం తగ్గినట్టయింది. నగర పరిధిలోని నివాసాలతోపాటు వాణిజ్య సముదాయాలు, దుకాణాల నుంచి చెత్త సేకరణకు గత వైసీపీ ప్రభుత్వం యూజర్ చార్జీల వసూలుకు శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఘన వ్యర్థాల నిర్వహణ చట్టం-2016 ప్రకారం చెత్త సేకరణ, తరలింపు శాస్త్రీయ నిర్వహణకోసం యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నట్టు ప్రకటించింది. రెసిడెన్షియల్ కేటగిరీలో 82,354 అసెస్మెంట్లు, కమర్షియల్ కేటగిరీలో ఉన్న 5452 అసెస్మెంట్ల నుంచి కాకినాడ నగరపాలకసంస్థ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో యూజర్ చార్జీలు రూ.57లక్షలు వసూలు చేసింది. అందుకు వీలుగా నాలుగేళ్ల కిందట కౌన్సిల్‌లో తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు టీడీపీ సహా విపక్ష కార్పొరేటర్లంతా దీనిపై తీవ్రంగా వ్యతిరేకించారు.

అప్పట్లో ప్రాంతాలవారీగా విభజన

అప్పట్లో ఒక్కోప్రాంతానికి ఒక్కో రకంగా డబ్బులు వసూలు చేసేలా కేటాయించారు. స్లమ్ ఏరియా రూ.60, నాన్ స్లమ్ రూ.90, కమర్షియల్ రూ.100 నుంచి రూ.10వేల వరకు వసూలు చేసేవారు. నివాస భవనాలను నెలకు రూ.80 చొప్పున, మురికివాడల్లో అయితే రూ.30 నుంచి రూ.60, అపార్టుమెంట్లు అయితే రూ.500 నుంచి రూ.700, కమర్షియల్ కేటగిరీ రూ.200 నుంచి రూ.10వేల వరకు యూజర్ చార్జీలు వసూలు చేసేందుకు తీర్మానాన్ని ఏకపక్షంగా ఆమోదించింది. అదే ఏడాది నవంబరు నుంచి యూజర్ చార్జీలు వసూలుకు శ్రీకారం చుట్టారు. వార్డు వలంటీర్లతోపాటు సచివాలయంలోని శానిటరీ సెక్రటరీలకు ఆ బాధ్యత అప్పగించారు. కానీ యూజర్ చార్జీల వసూలుపై నగరవాసులనుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో కొన్నాళ్లు వసూళ్లకు వెనుకాడిన కార్పొరేషన్ అధికారులు తిరిగి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో వార్డు సచివాలయ కార్యదర్శులపై ఒత్తిడి పెంచారు. నెలవారీ టార్గెట్లు విధించి చార్జి మెమోలు జారీ చేస్తూ హడలెత్తించారు. ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి యూజర్‌చార్జీలు వసూలు చేయలేక తరచూ ఆందోళనలకు దిగేవారు. కార్పొరేషన్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లలో చెత్తపన్ను విధింపుపై ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే యూజర్ చార్జీలను రద్దు చేస్తామని నాడు విపక్షనేతగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే యూజర్‌చార్జీల వసూలును కార్పొరేషన్ అధికారులు నిలిపివేశారు. ఈ క్రమంలో చెత్త సేకరణకు యూజర్ చార్జీలు వసూలును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఇప్పుడు ప్రకటించారు.

నాసిక్ స్టాంపులు.. మళ్లీ వచ్చేస్తున్నాయ్



- నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేయని గత వైసీపీ ప్రభుత్వం
- ఇప్పుడు ప్రత్యేక దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం
- స్టాంపుల అవసరతపై వివరాలు సేకరిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ
- త్వరలో వినియోగదారులకు అందుబాటులోకి..

పెద్దాపురం, అక్టోబరు 2: జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు గతంలో వినియోగించే నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు తిరిగి అందుబాటులోకి రానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం వీటిని కొనుగోలు చేయకుండా ఈ స్టాంపింగ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిపై వినియోగదారుల నుంచి విముఖత వ్యక్తం కావడం, నాసిరకంగా ఉన్నాయంటూ విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి వినియోగదారులకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంది.

గతంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులే వినియోగం..

గతంలో రిజిస్ట్రేషన్లు, అఫిడవిట్లు, అగ్రిమెంట్లకు నాసిక్‌లో తయారయ్యే నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను వినియోగించేవారు. ఇవి రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో, స్టాంపు వెండర్ల ద్వారా క్రయవిక్రయాలు చేసేవారు. రూ.10, రూ.20, రూ.50, రూ.100 స్టాంపులు నాణ్యతతో సుదీర్ఘ కాలం మన్నేలా ఉండేవి. గత వైసీపీ పాలనలో వీటిని కొనుగోలు చేయలేక నాసిక్ స్టాంపులు విక్రయాలు నిలిపివేసింది. 2022, ఆగస్టు నెలాఖరు నుంచి వీటిని కొనుగోలు చేయ లేదు. దీంతో ఈ-స్టాంపింగ్ పేరుతో నాసిరకం పత్రాలను గత వైసీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చింది. రిజిస్ట్రేషన్లకు ఫిజికల్ స్టాంపు పేపర్లు అవసరం లేదని, ఈస్టాంపులను వాడాలంటూ అధీకృత కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి విక్రయాలు సాగించారు. ఈ దస్త్రాలపై అక్షరాలు కొద్దిరోజులకే చెరిగిపోతాయంటూ వినియోగదారుల నుంచి ఆందోళనలు చెలరేగాయి. దీనిపై అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పందించ లేదు. అవసరాన్ని బట్టి రూ.100 ఈ స్టాంపులను అదనంగా రూ.20 నుంచి రూ.30 వరకూ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నాసిక్ నుంచి నాన్‌జ్యుడీషియల్ స్టాంపులను తెప్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. జిలాల్లవారీగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఎంతవరకూ అవసరమనే విషయాన్ని ఆశాఖ అధికారులు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. కాకినాడ జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఎంతమేర నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అవసరత ఉందో అధికారులు ఆరాతీస్తున్నారు.

ప్రతీ గ్రామాన్ని స్వచ్ఛతా గ్రామంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- అధికారులు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ

కాకినాడ రూరల్, అక్టోబరు 2: జిల్లాలోని ప్రతీ గ్రామాన్ని స్వచ్ఛతా గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొదటిగా మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అధికారులు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. ఉత్తమ సేవలందించిన నలుగురు పంచాయతీ కార్మికులను సత్కరించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలకు సంబంధించి కాకినాడ జిల్లాలో గత నెల 17 నుంచి ఇప్పటివరకూ అన్నిగ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డీపీవో కే.భారతి, రూరల్ మండలం ప్రత్యేక అధికారిణి జె.సత్యవతి, ఎంపీడీవో కె.స్వప్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కాకినాడలో కసాయి తండ్రి

- అమ్ముడు పోవడం లేదని ఆడ శిశువును గోడకేసి కొట్టి హతమార్చిన వైనం
- కాకినాడలో దారుణ సంఘటన
- నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

- 6లో

గొల్లప్రోలు పుష్కర కాలువలో పడి విద్యార్థి గల్లంతు

-7లో

నేటి నుంచి టెట్ పరీక్షలు

- ఈనెల 21 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ
- జిల్లాలో నాలుగు పరీక్షాకేంద్రాలు
- హాజరు కానున్న 21,471 మంది అభ్యర్థులు

కాకినాడ రూరల్, అక్టోబరు 2: టెట్-2024కు సంబంధించిన పరీక్షలు ఆన్‌లైన్‌లో 3వతేదీ గురువారం నుంచి 21 వరకూ జరుగనున్నాయి. ఈ మేరకు కాకినాడ జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జేసీ రాహుల్ మీనా తెలిపారు. కాకినాడలోని ఐయాన్ డిజిటల్ జోన్, సాఫ్ట్ టెక్నాలజీ, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలోని రెండు కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 21,471మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, వాటికి సంబంధించి నలుగురు విద్యాశాఖాధికారులను, డిపార్టుమెంట్ అధికారులను, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి వికలాంగుల కోసం 27మంది స్క్రయిబ్‌లను నియమించామని తెలిపారు. పరీక్షలు 9.30 గంటల నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతాయని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి లేటెస్ట్ ఫొటో, గుర్తింపు కార్డుతో తప్పక హాజరుకావాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 7799698462, 9666375814, 9010545547 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నిండుకుంటున్న నెయ్యి నిల్వలు

- సత్యదేవుడి సన్నిధిలో నెయ్యి కొనుగోలుకు ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురుచూపులు
- గతనెల 30తో ముగిసిన పాత కాంట్రాక్ట్ గడువు

- 7లో

రూ.3 లక్షలు విలువైన పట్టు వస్త్రాలు అందజేత

- 7లో

శ్రీపీఠంలో మహాశక్తియాగం



మీడియాతో మాట్లాడుతున్న పరిపూర్ణానంద సరస్వతి

శ్రీపీఠంలో ఏర్పాట్లు

- దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా 11 రోజులపాటు కార్యక్రమాలు
- దివ్యాలంకరణలు, శతకోటి కుంకుమార్చనలు
- వివరాలు వెల్లడించిన శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద సరస్వతి

కాకినాడ రూరల్, అక్టోబరు 2: దేవీ శరన్నవరాత్రులు సందర్భంగా గురువారం నుంచి ఈనెల 13వతేదీ వరకూ మహాశక్తియాగాన్ని 11రోజుల పాటూ నిర్వహించనున్నట్లు శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటలోని శ్రీపీఠంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో మహాశక్తియాగం కార్యక్రమాల వివరాలను ఆయన వివరించారు. గతేడాది కార్తీకమాసంలో 30రోజులపాటు మహాశక్తియాగం నిర్వహించామన్నారు. 100కోట్ల కుంకుమార్చన చేయడమనేది దేశచరిత్రలో అత్యంత కీలకమైన ఘట్టమని, దీన్ని పూర్తిచేయాలన్న సంకల్పంతో ఉన్నామని, ప్రతిరోజూ 35వేలమంది భక్తులు ఈ యాగానికి హాజరయ్యే అవకాశముందని తెలిపారు. ఈప్రాంతంలో వెయ్యికోట్ల కుంకుమార్చనలు రాబోయే పదేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. ఇప్పటివరకూ 54వేలకుపైగా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయన్నారు. 10న 64వేలమంది మహిళలతో లలితసహస్ర విరాట్ పారాయణం జరుగుతుందని తెలిపారు. దివ్యాలంకరణలు, శతకోటి కుంకుమార్చన, శాంతికర కళ్యాణం 24వేలమంది విద్యార్థులతో త్రికోటి మహాసరస్వతిపూజ, 300 చండీహోమాలు జరుగుతాయని తెలిపారు. తిరుపతి లడ్డూలో వెంకటేశ్వరస్వామిని చూసుకుంటామని, ఈ వివాదం ప్రస్తుతం కోర్టులో ఉన్నందున దానిపై తాను మాట్లాడనని విలేఖర్లు అడిగిన ప్రశ్నకు పరిపూర్ణానంద సరస్వతి సమాధానమిచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నిఏర్పాట్లు పూర్తిచేశామని, మహాశక్తి యాగంలో రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొంటారన్నారు. గురువారం అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకోవచ్చని అన్నసూక్త, అన్నపూర్ణహోమం, లక్షపుష్పార్చన జరుగుతాయని తెలిపారు.

ఉరుములు, మెరుపులతో...

భారీవర్షం

- ప్రత్తిపాడు, కిర్లంపూడిల్లో జోరుగా వాన
- పలుచోట్ల పిడుగులు



కిర్లంపూడి మండలం వేలంకలో కురుస్తున్న వర్షం.. (ఇన్‌సెట్)లో చిల్లంగిలో పిడుగు పడి దగ్ధమవుతున్న కొబ్బరిచెట్టు



ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు సెంటర్లో ప్రధాన రహదారిపై కురుస్తున్న వర్షం

కిర్లంపూడి, అక్టోబరు 2: జిల్లాలో పలుచోట్ల బుధవారం భారీవర్షం కురిసింది. మెరుపులు, పిడుగులతో కూడిన వాన పడింది. కిర్లంపూడి మండలంలోని చిల్లంగి, జగపతినగరం, వేలంక గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వేలంకలో భారీవర్షం పడింది. చిల్లంగిలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడడంతో పూర్తిగా దగ్ధమైంది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఉదయం నుంచి విపరీతమైన ఎండ కాసినా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

ప్రత్తిపాడు, అక్టోబరు 2: ప్రత్తిపాడులో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. ఉదయంనుంచి సాయంత్రం వరకు ఎండ కాసింది. సాయంత్రం 6గంటలకు నుంచి రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురిసింది. దీంతో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ అల్లూరి సెంటర్, తహసీల్దార్ కార్యాలయ సెంటర్ తదితర చోట్ల వర్షపునీరు పెద్దఎత్తున నిలిచిపోయింది.



ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో నేటి నుంచి
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

ద్రాక్షారామ, అక్టోబరు 2: అష్టాదశ శక్తి పీఠాల్లో ద్వాదశ శక్తి పీఠంగా పూజలు అందుకుంటున్న ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 3 నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. 3వ నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో వేదపారాయణ ప్రయుక్త, దేవీ భాగవతం, చండీ సప్తశతి, సుందరకాండ, మన్యు సూక్తం, లలితా పారాయణ, సూర్యనమస్కారాలు, నవగ్రహ జపాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 3.30 వరకు శ్రీచక్ర నవావర్ణార్చన, 3.30 గంటలకు కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు అమ్మవారికి సువర్ణ, రజత పుష్పార్చన జరుపుతారు. మూలా నక్షత్రం సందర్భంగా ఈ నెల 9న సరస్వతి పూజ, విజయదశమిని పురస్కరించుకుని 12న శమీపూజ వేగాయమ్మపేటలో నిర్వహిస్తారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

తొండంగి, అక్టోబరు 2: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు పెట్రోలు బంకు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కలకత్తా నుంచి చెన్నై ఐరన్ షీట్ల లోడుతో వెళ్తున్న లారీని డ్రైవర్ ఎటువంటి హెచ్చరిక సిగ్నల్ వేయకుండా ఆకస్మికంగా ఆపివేశాడు. వెనుకనే విశాఖ నుంచి పాలకొల్లు రొయ్యల లోడు నిమిత్తం వెళ్తున్న లారీ ముందున్న లారీని బలంగా ఢీకొట్టడంతో లారీ కేబిన్ నుజ్జునుజ్జయ్యింది. అందులో చిక్కుకున్న డ్రైవర్ బలుసు వెంకటరమణకు (40) తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడిది విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం డోకిశీల దగ్గర బుచ్చింపేట గ్రామంగా గుర్తించారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిండుకుంటున్న నెయ్యి నిల్వలు

» గత నెలాఖరున ముగిసిన పాత కాంట్రాక్టు » ప్రభుత్వ ఉత్తర్వుల కోసం అన్నవరం దేవస్థానం అధికారుల ఎదురుచూపు



అన్నవరం, అక్టోబరు 2: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో ప్రసాదం కోసం వినియోగించే నెయ్యి నిల్వలు నిండుకుంటున్నాయి. ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంలో నెయ్యి కల్తీ వ్యవహారంతో అన్నవరం దేవస్థానం అధికారులు నెయ్యి వినియోగంపై తర్జనభర్జన పడుతున్నారు. అన్నవరం దేవస్థానానికి ఏటా రెండు లక్షల కిలోల నెయ్యి అవసరమవుతుంది. వరుసగా నాలుగు పర్యాయాలు టెండరు దక్కించుకున్న రైతు డెయిరీ కాంట్రాక్టు సెప్టెంబరు 30తో ముగిసింది. దీనికి సంబంధించి నెల క్రితం అక్టోబరు 1 నుంచి నెయ్యి సరఫరాకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ద్వారా తిరుపతికి చెందిన ఒక సంస్థ ఎల్-1 కాంట్రాక్టుతో టెండరు దక్కించుకోగా ఆ కంపెనీ ఇంకా కొనుగోలు ప్రారంభించలేదు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురు చూడడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా కొనుగోలు చేయాలా, ఇటీవల ఎల్-1 కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ నుంచి కొనుగోలు చేయాలా అనే మీమాంసలో అధికారులు ఉన్నారు. ప్రస్తుతం దేవస్థానంలో నెయ్యి నిల్వలు నిండుకుంటున్నాయి. ప్రస్తుతం ఉన్న నెయ్యి మరో నాలుగు రోజులు వస్తుందని భావిస్తున్నారు. ఈలోగా ఉత్తర్వులు రాకుంటే ప్రసాదం ఎలా తయారు చేయాలో తెలియని పరిస్థితి. అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ ప్రస్తుతం దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉండడంతో కమిషనరుతో చర్చించే అవకాశముంది. కమిషనరు సైతం ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూడాలని, స్వతంత్రంగా నిర్ణయం తీసుకోకూడదని భావిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలో లేనప్పుడు కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా నెయ్యి కొనుగోలు చేసేవారు. పదేళ్ల క్రితం ఈ విధంగా చేయగా అప్పటి, ప్రస్తుత ఈవో రామచంద్రమోహన్‌పై అభియోగాలు నమోదయ్యాయి. దీంతో ఆయన కూడా ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నారు.





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజయ్‌ప్రకాష్, కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న బాలికలు

క్రీడా సంరంభం

'శ్రీప్రకాష్'లో కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభించిన విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

తుని రూరల్, అక్టోబరు 2: కాకినాడ జిల్లా తునిలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో సీబీఎస్ఈ క్లస్టర్-7 (ఆంధ్ర, తెలంగాణ) కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. సుమారు వందకు పైగా పాఠశాలల నుంచి 1,200 మంది విద్యార్థులు హాజరయ్యారు. శాప్ రిటైర్డ్ కబడ్డీ కోచ్, ప్రో కబడ్డీ అఫీషియల్ పీవీఎస్‌వీ ప్రసాద్, ప్రో కబడ్డీ అఫీషియల్ బి.మురళీకుమార్, వాలీబాల్ నేషనల్ రిఫరీ బి.శ్రీనివాసరావు, వాలీబాల్ అసోసియేషన్ సభ్యుడు మోహన్‌బాబు హాజరయ్యారు. బాలికలకు అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలను శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, గౌరవ అతిథులు జాతీయ జెండా, సీబీఎస్ఈ స్పోర్ట్ జెండా, శ్రీప్రకాష్ జెండాలను ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన బాలికలు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. విజయప్రకాష్ మాట్లాడుతూ గెలుపు, ఓటమి సహజమని, పోటీల్లో పాల్గొనాలనే క్రీడా స్ఫూర్తి కలిగిన వారంతా విజేతలేనన్నారు. మిమ్మల్ని పోటీలకు పంపిన తల్లిదండ్రులు అభినందనీయులన్నారు. రెండు రాష్ట్రాల నుంచి హాజరైన జట్ల కెప్టెన్లను, సభ్యులను విజయప్రకాష్, అతిథులు పరిచయం చేసుకున్నారు. పరిశీలకులు ఎల్.వెంకటరమణ, కె.హేమంత్‌కుమార్‌రావు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ సంస్థల సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి



క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు

రాజానగరం, అక్టోబరు 2: జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థలు సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కొనియాడారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నెలకొల్పిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఆమె బుధవారం ప్రారంభించారు. డిజిటల్ లాప్రోస్కోపిక్ సర్జికల్ యూనిట్‌ను మరో ముఖ్య అతిథి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, జనరల్ వార్డులను ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం శుశ్రుత ఆడిటోరియంలో జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ 38 ఏళ్ల కిందట రాజమహేంద్రవరంలో చిన్న సంస్థగా ఆవిర్భవించిన జీఎస్ఎల్ సంస్థలు నేడు ఉన్నత ప్రమాణాలు, అత్యాధునిక వైద్య విధానాలతో విద్యనందించడమే కాకుండా సమాజానికి చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా వైద్య విద్యార్థులు, ప్రముఖులతో ప్రతిజ్ఞ చేయించారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. జీఎస్ఎల్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. అతిథులకు గన్ని భాస్కరరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గన్ని కాశింబి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ టీవీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ గురునాథ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకుల అరెస్టు

రాజానగరం, అక్టోబరు 2: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధంలోని చంద్రిక-అవంతిక అపార్ట్‌మెంట్‌లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్టు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ బుధవారం తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన మిట్టని సాయికుమార్, కట్టమూరి యశ్వంత్ వీర నాగ సూర్య శ్రీసత్య సాయి, దుర్గాడ వంశీ చంద్రిక అవంతిక అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. గంజాయి తాగే అలవాటు ఉన్న కొంతమంది యువకులను పిలిచి, వారికి గంజాయి విక్రయించి, తాగే వరకు ఇక్కడే ఉంచడం వృత్తిగా మలుచుకున్నారు. విషయం తెలుసుకున్న రాజానగరం సీఐ సిబ్బందితో దాడి చేసి గంజాయి తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటున్న ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. మిగిలిన ముగ్గురికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ చెప్పారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును, నిందితులను చూపిస్తున్న సీఐ విద్యాసాగర్, ఎస్ఐ సురేంద్ర

చెడు వ్యసనాలకు బానిసలై...చోరీల బాట

వాడపాలేనికి చెందిన ఇద్దరు యువకుల అరెస్టు... రూ.13లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం

కొత్తపేట, అక్టోబరు 2: చెడు వ్యసనాలకు బానిసలై ఈజీ మనీ కోసం చోరీల బాటపట్టిన ఇద్దరు యువకులను బుధవారం అరెస్టు చేసి కోర్టుకు పంపించినట్టు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం బ్యాంకు కాలనీకి చెందిన రామోజు అనురాధ కుటుంబ సభ్యులతో కలిసి మే 5న రాజమహేంద్రవరం వెళ్లి 9న తిరిగి ఇంటికొచ్చింది. తలుపులు పగులకొట్టి బీరువాలో ఉన్న సుమారు రెండు కిలోల వెండి వస్తువులు, 212 గ్రాముల బంగారు ఆభరణాలు, టైటాన్ వాచ్ చోరీకి గురైనట్టు గుర్తించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సూచనల మేరకు కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర, సిబ్బంది.. కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన బండారు మణికంఠ, చింతపల్లి వెంకట్రాజు అనే యువకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తు రీకవరీ చేశారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ విద్యాసాగర్, సీసీఎస్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సురేంద్ర, సీసీఎస్ ఏఎస్ఐ బాలకృష్ణ, హెచ్‌సీ బీఎస్ స్వామి, సిబ్బంది ఎం.వీర్రాజు, ఆర్.సుబ్రహ్మణ్యం, జి.కృష్ణసాయి, బి.అర్జునరావు, ఎస్.బ్లెస్సన్‌లను ఎస్పీ అభినందించారు.



మొసలిని డ్యామ్‌లోకి వదులుతున్న హోంగార్డు రామన్నదొర

అమ్మో! మొసళ్లు

డొంకరాయి డ్యామ్‌పై సంచారం

సాహసించి పట్టుకున్న హోంగార్డు

మోతుగూడెం, అక్టోబరు 2: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి డ్యామ్‌పై అర్ధరాత్రి వేళ మొసళ్లు సంచరిస్తున్నాయి. ఓ హోంగార్డు డ్యూటీ నిర్వహిస్తుండగా ఏదో అలికిడి అయిన శబ్దం వినిపించింది. పరిశీలించగా డ్యామ్‌పై రెండు మొసళ్లు కనిపించడంతో సహచర హోంగార్డులకి సమాచారం అందించాడు. వారు హుటాహుటిన మొసళ్లు సంచరిస్తున్న ప్రదేశానికి చేరుకున్నారు. హోంగార్డుల అరుపులకు ఒక మొసలి డొంకరాయి రిజర్వాయర్లోకి దూకేసింది. హోంగార్డు ఎస్.రామన్నదొర సాహసం చేసి అరడుగుల పొడవున్న ఉన్న మొసలిని పట్టుకున్నాడు. దాని మూతికి తాడు కట్టి ఈడ్చుకుంటూ వెళ్లి రిజర్వాయర్లోని నీటిలో వదిలిపెట్టాడు. సాహసం చేసిన హోంగార్డు రామన్నదొరను ఏపీ జెన్‌కో ఉద్యోగులు, గ్రామస్థులు అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఆయిల్‌తో అధికారులు

నిల్వ స్థావరంపై అధికారుల దాడి

9,400 లీటర్ల ఆయిల్ స్వాధీనం

మామిడికుదురు, అక్టోబరు 2: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాశర్లపూడిలంకలో అక్రమంగా నిల్వ ఉంచిన సాల్వెంట్ ఆయిల్ స్థావరంపై విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. పాశర్లపూడిలంక గ్రామానికి చెందిన రాచకొండ వెంకటేశ్వరరావు ఏ విధమైన అనుమతి లేకుండా తన ఇంటి వద్ద ఆయిల్ నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్నాడు. విజిలెన్స్ సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేసి నిల్వ ఉంచిన 9,400లీటర్ల ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. సివిల్ సప్లయిస్ డీటీ డి.శ్రీనివాస్, వీఆర్వో రాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.





కొడవలి పుష్కర కాలువలో గల్లంతైన సతీష్ కోసం గాలిస్తున్న దృశ్యం

పుష్కర కాలువలో పడి విద్యార్థి గల్లంతు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 2: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి పుష్కర కాలువలో పడి విద్యార్థి గల్లంతయ్యాడు. కొడవలి గ్రామానికి చెందిన ఉప్పనబోయిన సతీష్ (15) తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బుధవారం బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి ఇంటి దగ్గర నుంచి బయటకు వెళ్లాడు. అక్కడ పుష్కర కాలువలోకి దిగి గల్లంతయ్యాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు సతీష్ ఆచూకీ లభించలేదు.



దాత సమర్పించిన నూతన పట్టు వస్త్రాలతో అర్చకులు, అధికారులు

రూ.3 లక్షలు విలువైన
పట్టు వస్త్రాలు అందజేత

అన్నవరం, అక్టోబరు 2: శరన్నవరాత్రులను పురస్కరించుకుని రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారు, శంకరుడు, సీతారాములు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు బుధవారం ఒక దాత రూ.3లక్షలు విలువైన పట్టు వస్త్రాలను సమర్పించారు. విజయవాడకు చెందిన రావాడ చిరంజీవిరావు వీటిని ఆలయ సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి సుధీర్, బీఎస్ రాంబాబు పాల్గొన్నారు. పట్టు వస్త్రాలను నవరాత్రుల్లో అలంకరిస్తామని ప్రధానార్చకుడు చెప్పారు.



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సునీత

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు సుప్రీంకోర్టుకు సిఫార్సు చేస్తాం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

రాజమహేంద్రవరం, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు వారి పేర్లను సుప్రీంకోర్టుకు సిఫార్సు చేస్తామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మహిళా ప్రత్యేక కారాగారంలో బుధవారం నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ మార్గం అనుసరణీయమన్నారు. మహిళా ఖైదీల సమస్యలను, కేసు వివరాలను తెలుసుకుని తగు న్యాయం చేస్తామన్నారు. మహిళా జైలు వాతావరణం సబర్మతి ఆశ్రమాన్ని తలపిస్తోందని వక్తలు ప్రశంసించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలకు పీడీజే బహుమతులు అందజేశారు. అనంతరం కేంద్ర కారాగారంలో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి హాజరయ్యారు. జైలులో ఖైదీల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న వివిధ వస్తువుల తయారీ యూనిట్లు, నర్సరీ, నైపుణ్య శిక్షణను జైలు అధికారులు పీడీజేకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఆర్.శ్రీలత, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు, మహిళా జైలు సూపరింటెండెంట్ సీహెచ్ వసంతకుమారి, కేంద్ర కారాగార ఉప పర్యవేక్షణాధికారి ఎం.రాజ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, జైలర్ పావని తదితరులు పాల్గొన్నారు.



పాదగయ ఆవరణలో పిండ ప్రదానాలు చేస్తున్న భక్తులు

పిఠాపురం పాదగయకు
పోటెత్తిన భక్తులు

మహాలయ అమావాస్య సందర్భంగా పిండ ప్రదానాలు

పిఠాపురం, అక్టోబరు 2: కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి బుధవారం భక్తులు పోటెత్తారు. పితృ పక్షాలుగా వ్యవహరించే ఈ సమయంలో మహాలయ అమావాస్యకు విశేష ప్రాధాన్యత ఉంది. పితృ దేవతలకు ఈ రోజున పిండ ప్రదానాలు చేస్తే మంచిదనే నమ్మకంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి పిండ ప్రదానాలు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో పాటు పలువురు ప్రముఖులు పిండ ప్రదానాలు చేసేందుకు వచ్చారు. బైపాస్‌తో పాటు పిఠాపురం-సామర్లకోట రోడ్డులో వాహనాలను బారులుతీరి నిలిపారు. పాదగయ మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

మహాలయ అమావాస్య సందర్భంగా పాదగయలోని కుక్కుటేశ్వర స్వామి దేవస్థానానికి బుధవారం ఒక్కరోజు రూ.5.89 లక్షల ఆదాయం వచ్చినట్టు కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పి.విశ్వనాథ రాజు తెలిపారు. పిండ ప్రదానాల టిక్కెట్ల ద్వారా రూ.2,46,500, అన్నదానం ద్వారా రూ.2,34,472, గ్రోగాసం టిక్కెట్ల ద్వారా రూ.4,602, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.47,825, పూజా టిక్కెట్ల ద్వారా రూ.55,360 వచ్చాయి.

విలీన మండలాల్లో ప్రారంభమైన
బతుకమ్మ సంబరాలు

ఎటపాక, అక్టోబరు 2: విలీన మండలాల్లో బతుకమ్మ సంబరాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తోటపల్లి, సీతాపురం, గౌరిదేవిపేట, చోడవరం, నెల్లిపాక, నందిగామ తదితర గ్రామాల్లో మహిళలు, బాలికలు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. తొలి రోజు వెంగిలి బతుకమ్మను ఏర్పాటు చేసి బతుకమ్మలను ఎత్తుకుని మహిళలు ప్రదక్షిణలు చేశారు. సంబరాలు తొమ్మిది రోజులు జరుగుతాయి.



తోటపల్లిలో బతుకమ్మను ఎత్తుకుని పాటలు పాడుతున్న బాలికలు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

4 వేలమందికి అన్నదానం

పోర్టుసిటీ (కాకినాడ), అక్టోబరు 2: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మెయిన్‌రోడ్‌లోని సూపర్ బజార్ లక్ష్మీగణపతి ఆలయం వద్ద బుధవారం 4 వేలమందికి అన్నదానం చేశారు. సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.శివాజీగణేష్, వైస్ చైర్‌పర్సన్ వరిపల్లి కృష్ణవేణి, డైరెక్టర్లు యాళ్ల పట్టాభిరామయ్య, మన్నే నాగేశ్వరరావు, బత్తిన పైడిరాజు, డీవీవీ ప్రసాద్, బి.బాలకృష్ణ, డీవీ ఆదినారాయణ పాల్గొన్నారు.



పిఠాపురంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వర్మ

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



సభలో పాల్గొన్న పీడీ, నాయకులు

శంఖవరం, అక్టోబరు 2: గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో నిర్వహించిన ఉపాధి పనులపై బుధవారం మండల పరిషత్ ఆవరణలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. 14గ్రామాల్లో జరిగిన పనుల రికార్డులను పరిశీలించిన డీఆర్‌పీలు వాటినివేదకలను పీడీ ముందు ఉంచారు. సుమారు 782పనులుకుగాను రూ.8కోట్లకు ఆడిట్ నిర్వహించారు. రూ.1.66 లక్షల రికవరీకి ఆదేశించారు. కత్తిపూడి, శంఖవరం, నెల్లిపూడి, మండపం గ్రామాలకు చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు స్వచ్ఛందగా రాజీనామా చేయగా ఎస్.జగ్గంపేట ఉపాది ఫీల్డ్ అసిస్టెంటను సస్పెండ్ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ జగదాంబ, సీనియర్ టీడీపీ నేతలు పర్వత సురేష్, బద్ది రామారావు, వెన్నా శివ, ఉల్లి వీరభద్రరావు, కీర్తి వెంకటసుబాష్, జనసేన నేతలు కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుబాష్, మేకల కృష్ణ, బద్ది రమణ, ఓలేటి లక్ష్మీనారాయణ,సర్దం గోవిందు పాల్గొన్నారు.

నేటి నుంచి భేతాళస్వామి నవరాత్రి ఉత్సవాలు

సామర్లకోట, అక్టోబరు 2: మండలంలో వేట్లపాలెం గ్రామంలో భేతాళస్వామి నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. సాయంత్రం గ్రామ పొలిమేరల నుంచి ఉత్సవమూర్తిని మేళతాళములు, మంగళవాయిద్యాల నడుమ, భారీ బాణసంచా కాల్పుల మధ్య ప్రదర్శనగా ఆలయానికి తీసుకువస్తామన్నారు. భేతాళస్వామికి 9రోజులు విశేష పూజలను చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు ముగింపులో భాగంగా ఈనెల 13న ఆదివారం సాయంత్రం భేతాళస్వామిని పురవీధులమీదుగా భారీ ఊరేగింపు నిర్వహించి సంస్కృత కార్యక్రమాలతో సంబరం చేయనున్నట్లు తెలిపారు. పెద్దఎత్తున ప్రముఖులు, భక్తులు హాజరుకానున్నందున అన్ని ఏర్పాట్లు చేసినట్లు కమిటీ ప్రతినిధులు చెప్పారు.

నేటి నుంచి శరన్నవరాత్రి వేడుకలు

తొండంగి, అక్టోబరు 2: మండలంలోని ఏకొత్తపల్లి కదంబ క్షేత్రంలో గురువారం నుంచి శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభంకానున్నట్లు ఆలయ నిర్వాహకులు భూమానంద భారతి తెలిపారు. 3న కలశ స్థాపన, 4న బాలాత్రిపుర సుందరి అలంకారం, 5న గాయత్రి, 6న అన్నపూర్ణాదేవి, 7న లలితా త్రిపురసుందరి, 8న మహాలక్ష్మి, 9న మహాసరస్వతి, 10న దుర్గాదేవి, 11న మహిసాసుర మర్ధిని, 12న రాజరాజేశ్వరి అలంకారం సాయం త్రం శమీపూజ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పోర్టుసిటీ (కాకినాడ): ఈ నెల 3 నుంచి 13 వరకు కాకినాడ సంతచెరువు సెంటర్‌లోని కామాక్షి అమ్మవారి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చేబ్రోలు కృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు అరటికట్ల రాంబాబు వెల్లడించారు. ఆలయ కమిటీ సభ్యులు చెల్లూరి సత్యనారాయణ, పొన్నాడ బ్రహ్మానందం, ఆలయ అర్చకులు నాగేంద్రాచారి పాల్గొన్నారు.

భువనేశ్వరీ పీఠంలో ఉత్సవాలకు శ్రీకారం

పెద్దాపురం, అక్టోబరు 2: స్థానిక వర్తులవారి వీధిలోని భునేశ్వరీ పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని హంసవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. పీఠం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం పట్టణంలో పలు వీధుల గుండా సాగింది. 9 రోజుల పాటు అమ్మవారు పలు అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని గోపీశర్మ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్ధ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

చోరీలకు అవకాశాలు ఇవ్వొద్దు : ఎస్‌ఐ

ప్రత్తిపాడు, అక్టోబరు 2: దసరా పండుగ పురస్కరించుకుని గ్రామాల్లో చోరీలకు అవకాశాలు ఇవ్వవద్దని ప్రత్తిపాడు ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంతం కోరారు. మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి, ఉత్తరకంచి తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం దొంగతనాల నివారణపై స్థానికులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఇళ్లకు తాళాలువేసి కుటుంబ సమేతంగా ఊరు వెళ్లేవారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి వెళ్లడం ద్వారా వారు ఇంటి పరిసరాల్లో దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సమావేశాల్లో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

‘వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత’

తాళ్లరేవు, అక్టోబరు 2: కోరింగ అభయారణ్యంలో సంచరిస్తున్న వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని కోరింగ రేంజర్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ అన్నారు. బుధవారం కోరింగ అభయారణ్యం మడ అడవుల్లో వన్యప్రాణుల వారోత్సవాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మడ అడవుల అందాలను చూసేందుకు వచ్చిన సందర్శకులకు వన్యప్రాణుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంరక్షణలపై వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం

జగ్గంపేట, అక్టోబరు 2: గుర్రంపాలెం రోడ్‌లో గల జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మెంబర్లుగా పాండ్రంగి రాంబాబు, బొడ్డేటి సుమన్, నకిరెడ్డి సూర్యావతి, మానేపల్లి బంగార్రాజు ప్రమాణ స్వీకారం చేశారు. వారిని హాస్పటల్ వైద్యులు, సిబ్బంది, నాయకులు పూలమాలతో సత్కరించారు. అనంతరం జెడ్.రాగంపేటలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వాసుపత్రిని పరిశీలించారు. టీడీపీ నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్ఐ రఘునాధరావు, వేముల కొండ, జోగారావు, సురేష్, వైద్యులు ప్రణీత్, శంకర్, వర్మ, వినూష, శ్రావణ సంధ్య, మాధురి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న 3 వాహనాల సీజ్

తాళ్లరేవు, అక్టోబరు 2: యానాం నుంచి అనుమతులు లేకుండా డీజిల్‌ను తరలిస్తున్న 3 బొలేరా వాహనాలను పట్టుకున్నట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. స్థానికుల సమచారం మేరకు బుధవారం తెల్లవారుజామున యానాం నుంచి కాకినాడకు అక్రమంగా తరలిస్తున్న డీజిల్ వాహనాలను కోరింగ చెట్టు వద్ద పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారుల పట్టుకున్నారు. 7,200 లీటర్ల డీజిల్, వాహనాలను సీజ్ చేసి కోరింగ పోలీసుస్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లు కుడిపూడి దుర్గాప్రసాద్, పోలవరపు రమేష్, పోటుకూరి త్రినాధ్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో సివిల్‌సప్లయ్ అధికారిణి లక్ష్మీప్రసన్న, వీర్వోలు, పోలీసులు పాల్గొన్నారు.

పింఛను సొమ్ము చోరీ చేసిన యువకుడి అరెస్టు

పిఠాపురం, అక్టోబరు 2: వృద్ధురాలి వద్ద పింఛను సొమ్ము చోరీకి పాల్పడిన యువకుడిని పిఠాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలో గొల్లపేటకు చెందిన గోపాలపు అనంతలక్ష్మి మంగళవారం జగ్గయ్యచెరువు కాలనీలోని 11వ వార్డు సచివాలయంలో పింఛను సొమ్ము రూ.4వేలు తీసుకుని వస్తుండగా ఒక యువకుడు వచ్చి మోటార్‌సైకిల్‌పై ఇంటి వద్ద దింపుతానని చెప్పి కొంతదూరం వెళ్లిన తర్వాత వృద్ధురాలిని తోసివేసి ఆమె వద్ద ఉన్న రూ.4వేలు తీసుకుని పరారయ్యాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసిన పిఠాపురం పోలీసులు మండలంలోని పి.తిమ్మాపురం గ్రామానికి చెందిన జి.పవన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని అరెస్టు చేశారు.

మద్యపాన విముక్తి కోరుతూ దీక్ష

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 2: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా మద్యపాన విముక్తి కోరుతూ కలెక్టరేట్ వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన నిరాహార దీక్ష చేపట్టాయి. మద్యపాన విముక్తికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి ప్రచార నిర్వహణ నియంత్రణ చేయాలని సామాజికవేత్త నక్కా సూర్యనారాయణ కోరారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ మద్యం ఆదాయాన్ని ప్రభుత్వ వనరుగా చూడడం మానుకోవాలన్నారు. పౌరసంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు, బౌద్ద సంఘం అధ్యక్షురాలు భానుమతి, విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు శర్మ, సీపీఐ జిల్లా నాయకుడు తోకల ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ స్కూల్ కాంపిటేషన్స్ ప్రారంభం

పిఠాపురం, అక్టోబరు 2: పిఠాపురం మహారాజా రాజా రావు మహీపతి బహద్దూర్ 139వ జయంతిని పురస్కరించుకుని ఆదిత్య విద్యాసంస్థలు, పిఠాపురం మహారాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ స్కూల్ కాంపిటేషన్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు తొలిరోజు చెస్, క్యారమ్స్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. 3,4వ తేదిల్లో ఈ పోటీలు కొనసాగుతాయి. విజేతలకు మహారాజా జయంతి సందర్భంగా 5న బహుమతి ప్రదానం జరుగుతుందని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి తెలిపారు. కార్యక్రమాల్లో ఆదిత్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్ విజయసారథి, కిండర్ వండర్ ఇన్‌చార్జి రేవతి పాల్గొన్నారు.

బీజేపీ సేవా పక్షోత్సవాలు ముగింపు

ప్రత్తిపాడు, అక్టోబరు 2: ప్రధాని మోదీ జన్మదినోత్సవం సందర్భంగా బీజేపీ చేపట్టిన సేవా పక్షోత్సవాలు మంగళవారం ముగిశాయి. మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరంలలో జిల్లా బీజేపీ కిసాన్ మోర్చ అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, బీజేపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కందా వీరాస్వామి, ఊటా వీరబాబు, రామకర్తి సూర్యనారాయణ, ఊటా భాస్కర్ స్వచ్ఛత హీ సేవలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. గాంధీజీ విగ్రహాలను శుభ్రపరిచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొడ్డి పట్ల సుబ్బరాజు, ఊటా చక్రం, రంగనాద్ సుబ్బారావు తదితరులున్నారు.

గాంధీకి ఘన నివాళి

జిల్లాలో పలుచోట్ల మహాత్మాగాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు



కార్పొరేషన్: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, సామర్లకోటలో నివాళులర్పిస్తున్న తుమ్మల బాబు

కాకినాడ సిటీ, అక్టోబరు 2: గాంధీపార్కు.. ఒక చారిత్రాత్మక పార్కు.. అని స్వాతంత్రోద్యమ సమయంలో బాపూజీ ఈ ప్రాంతానికి వచ్చి కొంతసేపు సేదతీరారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గాంధీపార్కు ఆవరణలోని గాంధీ కాంస్య విగ్రహానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, కూటమి నాయకులు జొన్నాడ వెంకటరమణ, డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, వాసిరెడ్డి కుమార్ పాల్గొన్నారు.

నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు దండుప్రోలు నాగబాబు, గుత్తుల రమణ, సత్యనారాయణ, శీలం సూర్యనారాయణ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు(చిట్టిబాబు) అధ్యక్షత వహించగా మహాత్మాగాంధీ విగ్రహానికి, లాల్‌బహుదూర్‌శాస్త్రి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు చెక్క నూకరాజు, నాయకులు బండారు రవిప్రకాష్, దవులూరి ధనకోటి, పట్నీనీడి కృష్ణ, తాండ్రంకి రమణమూర్తి పాల్గొన్నారు. జడ్పీ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీ సీఈవో వీవీ.లక్ష్మణరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్(కాకినాడ): గాంధీ జయంతిని వెంకటరత్నపురం గాంధీభవన్‌లో సంఘ అధ్యక్షుడు వీఎల్ గాంధీ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ షాన్‌మోహన్ హాజరై గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. నందమూరి వీరవెంకట వినోద్ తయా రు చేయించిన గాంధీభవన్ వ్యవస్థాపకులైన డాక్టర్ తనికెళ్ల సత్యనారాయణమూర్తి, కొముండూరి శఠగోపాలాచార్యుల కాంస్య విగ్రహాలను కలెక్టర్ ఆవిష్కరించారు. బెంగళూరు వాస్తవ్యులు కెప్టెన్ ప్రభల సుబ్బారావు ఆధ్వర్యంలో ఉన్నతి సంస్థ ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ కాదా వెంకటరమణ, డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి కమిషనర్ భావన పూలమాలలు వేశారు. డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎస్ఈలు సత్యకుమారి, వెంకటరావు, మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కలెక్టరేట్(కాకినాడ): ఏపీ సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్, జనసేన నగర అధ్యక్షుడు తోట సుధీర్ తన కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధులు గాంధీజీ, లాల్ బహుదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల్పరించారు. గాంధీనగర్ కూడలిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల్పరించారు. కూటమి నాయకులు, తలాటం సత్య, ఆకుల శ్రీనివాస్, చోడిశెట్టి శ్రీమన్నారాయణ, జొన్నాడ వెంకటరమణ, సూరిబాబు, సుజాత, నాగమణి పాల్గొన్నారు.

తుని రూరల్: స్ఫూర్తి ప్రదాత మహనీయుడు గాంధీ అని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో యనమల రామకృష్ణుడు అన్నారు. తునికి వచ్చినప్పుడు గాంధీజీ బసచేసిన గాంధీ సత్రంలో వేడుకలు నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి కూటమి నేలతో కలిసి నివాళులర్పించిన యనమల దేశానికి మహాత్మాగాంధీ చేసిన సేవలను కొనియాడారు. సత్రంలో వేలాది మందికి వస్త్రదానం, అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల రాజేష్, మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, సిద్దాంతపు సత్తిబాబు, గడ్డమూరి శివ, జల్లు వాసు, అల్లు రాజు, సత్రం ఈవో అయ్యప్పరాజు పాల్గొన్నారు.

కిర్లంపూడి: గాంధీ జయంతిని కిర్లంపూడిలో సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆళ్ల నానాజీ, దాడి సూరిబాబు, సరిసే శివ, కాళ్ల వెంకటేష్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

శంఖవరం: తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి సీనియర్ టీడీపీ నేత పర్వత సురేష్ నివాళులర్పించారు. జనసేన, టీడీపీ నేతలు ఉన్నారు.

సామర్లకోట: గాంధీ చూపిన బాటలో అందరూ పయనించాలని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు పిలుపునిచ్చారు. సామర్లకోటలో గణపతినగరం వాటర్ ట్యాంక్ ఆవరణలో పట్టణ జనసేన ఆధ్వర్యంలో లయన్స్ భీమేశ్వరా క్లబ్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన నేత్ర వైద్యశిబిరాన్ని తుమ్మల ప్రారంభించారు. సుమారు 150 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి శస్త్ర చికిత్సకు అర్హత కలిగిన వారిని కిరణ్ కంటి ఆసుపత్రికి తరలించారు. అంతకుముందు మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సరోజా వాసు కూటమి నాయకులున్నారు. హుస్సేన్‌పురంలో టీడీపీ నేత చల్లా బుజ్జి ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోట అప్పారావు, కోట సురేష్, తలారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట టీడీపీ కార్యాలయం, జగ్గంపేట ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గాంధీ జయంతిని నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, వేములకొండ జోగారావు, సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునాధరావు ఉన్నారు. జగ్గంపేట ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గవర సుధాకర్, మరిసే రామకృష్ణ, మాదారపు వీరబాబు, దొడ్డ శ్రీను, సూరపరెడ్డి నరేష్, మొగిలి గంగాధర్ పాల్గొన్నారు.

పెద్దాపురం: మున్సిపల్ పార్కులో మహాత్ముడి విగ్రహానికి చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు ఆమె పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కమిషనర్ కేవీ పద్మావతి పాల్గొన్నారు. పులిమేరులో జనసేన జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుమ్మల పద్మజ ఆధ్వర్యంలో మహాత్ముడి విగ్రహానికి నివాళులర్పించారు. దుప్పట్లు పంపిణీ చేశారు. తుమ్మల సూర్యకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: సత్యాగ్రహమే ఆయుధంగా అహింసమార్గంలో పోరాడి కోట్లాది మంది భారతీయులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యం అందించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కొనియాడారు. స్థానిక వేగులమ్మ గుడివద్ద గాంధీ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానికులు స్వీట్లు పంచారు. ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ ఇంజనీర్ మోహన్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు గాంధీకి నివాళులర్పించారు.

పిఠాపురం: పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద గల గాంధీ విగ్రహానికి వాసవిక్లబ్, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులతో కలిసి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఉప్పాడ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు బీజేపీ నాయకులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, పసుపులేటి సత్యనారాయణ, బుర్రి మురళీధరరావు, తోట ఏడుకొండలు, ఓలేటి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధాన రహదారులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు, కమిషనరు రవికుమార్ పాల్గొన్నారు. గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహానికి జనసేన నాయకులు, స్వచ్ఛభారత్ ప్రతినిధులు, వాసవి క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలపరిషత్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మరామయ్య దొర, ఎంపీడీవో డీఎల్ఎస్ శర్మ నివాళులు అర్పించారు.

ఏలేశ్వరం: పెద్దనాపల్లిలో గాంధీ విగ్రహానికి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలేశ్వరంలో నగర పంచాతీ కార్యాలలయంలో కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కరప: కరప ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈవో, తహశీల్దార్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, పీహెచ్‌సీ, సచివాలయాల్లో గాంధీజీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, చింతా ఈశ్వరరావు, ఎంపీడీవో అప్పారావు, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి పాల్గొన్నారు.

తొండంగి: బెండపూడిలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏ.కొత్తపల్లి, తొండంగి, శృంగవృక్షం గ్రామాల్లో గాంధీ జయంతి నిర్వహించారు.


పారిశుధ్య కార్మికుల సేవలు నిరుపమానం : జేసీ



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జేసీ

పిఠాపురం, అక్టోబరు 2: మన ప్రాంతాన్ని మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు నిరుపమానమని జిల్లా జాయింట్ కలెక్టరు రాహుల్‌మీనా అన్నారు. పట్టణంలోని చిన్నమాంబ పార్కు వద్ద బుధవారం విధుల్లో ఉన్న పారిశుధ్య కార్మికులతో ఆయన మాట్లాడారు. వారికి కల్పిస్తున్న సౌకర్యాలు, గ్లౌజులు ఇస్తున్నారా లేదా ఇతర విషయాలను ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనరు కనకారావు తదితరులు ఉన్నారు.

బదిలీ అధికారులకు సత్కారం



కరప, అక్టోబరు 2: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం బదిలీపై వెళ్తున్న పలువురి అధికారులకు సత్కారం జరిగింది. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో కొంకి అప్పారావు, ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ, మండలపరిషత్ కార్యాలయం సిబ్బంది వీరేష్, రాయుడు, సురేష్, అనిల్, లక్ష్మి, కరప పంచాయతీ కార్యదర్శి వాసిరెడ్డి సునీల్ కుమార్‌లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, వైసీపీ మండలాధ్యక్షుడు చింత ఈశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్, కార్యాలయం ఏవో బీఎల్ నరసింహం తదితరులున్నారు.

‘మహనీయుడు మహాత్మాగాంధీ’

జేఎన్టీయూకే, అక్టోబరు 2: ప్రపంచానికి అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షతన మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని బుధవారం నిర్వహించారు. ఉపకులపతి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కొండమూరి

కాకినాడ సిటీ, అక్టోబరు 2: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కాకినాడ రామకృష్ణారావుపేటలో బుధవారం సాయి రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, డాక్టర్ భీమల దుర్గాప్రసాద్, డాక్టర్ జి.లక్ష్మణప్రసాద్ వైద్యపరీక్షలు నిర్వహించి 300మందికి ఉచితంగా మందులు అందజేశారు. కాకినాడ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కాకినాడ గాంధీనగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం సెంటర్, మెహర్‌నగర్‌లోని మానవీయ వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు అజ్జరపు సత్యనారాయణమూర్తి కార్యదర్శి రామనాథం పాల్గొన్నారు.

పలుచోట్ల స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు



తాళ్లరేవు: చొల్లంగిపేట గురుకులం పరిసరాలు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

తాళ్లరేవు, అక్టోబరు 2: ప్రతీ ఒక్కరు స్వచ్ఛతా హీసేవాలో భాగస్వాములైతే గ్రామాలు పచ్చగా ఉండి ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. బుధవారం చొల్లంగిపేట గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ పద్మావతి అధ్యక్షతన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళిలర్పించారు. గురుకులంలో విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే, ఎంపీ హరీష్ మాధుర్ అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ పద్మావతి పాఠశాలలో సమస్యలు, ఇబ్బందులను వివరించగా పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. పాఠశాల ఆవరణలో చీపుర్లను చేతపట్టుకుని పరిశుభ్రత చేశారు. ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, పెమ్మాడి కృష్ణవేణి, మందాల సత్తిబాబు,కట్టా త్రిమూర్తులు పాల్గొన్నారు.

సామర్లకోట: పట్టణంలోని నీలమ్మ చెరువు పరిసరాల్లో చెత్త చెదారాలను ఏరివేసేందుకు మున్సిపాల్టీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కమిషనర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ అరుణ చీపుర్లు చేతబట్టి నీలమ్మ చెరువు వాకింగ్ ట్రాక్‌ను శుభ్రపరిచారు. కూటమి నాయకులు, పలవురు కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అన్నవరం: రత్నగిరిపై చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజున దేవస్థానం ఉద్యోగులు సత్యగిరి కొండపై హరిహరసదన్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, సహాయకమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు కార్యక్రమం ప్రారంభించగా ఉద్యోగులు వాటిని నాటారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నట్టు గార్డెన్ సూపరెంటెండెంట్ ఐవీ రామారావు తెలిపారు.

గండేపల్లి: సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీ ఎన్ఎస్ ఎస్ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కాకినాడ ఎన్టీఆర్ బీచ్ సాగర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పరిసరాలు శుభ్రం చేసినట్టు యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, బి.రాంబాబు, పరిణయ శ్రీ, ప్రశాంతి పాల్గొన్నారు. సూరంపాలెం పవర్ గ్రిడ్ సంస్థలో రాజమండ్రి కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పవర్ గ్రిడ్ డీజీఎం పవన్‌కుమార్, డాక్టర్ సీహెచ్ కిరణ్మయి, హెచ్ఆర్ మేనేజర్ కోటేశ్వరరావు, డాక్టర్లు జి.తేజస్విని, సతీష్‌రెడ్డి, హరికృష్ణ, పవర్‌గ్రిడ్ సంస్థ అధికారులు వీరేంద్ర, ఎఎస్‌మూర్తి ఉన్నారు.

పిఠాపురం: పట్టణంలో స్వచ్ఛతా హి సేవా ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనరు కనకారావు పాల్గొన్నారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయంలో మహాత్మాగాంధీ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యనమలను కలిసిన ఎమ్మెల్యే



యనమలతో మాట్లాడుతున్న సత్యప్రభ

తుని రూరల్, అక్టోబరు 2: ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడును తేటగుంట క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ వ్యవహారాలపై యనమలతో చర్చించారు. ఆమె వెంట నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

ఘనంగా ప్రత్యంగిర హోమం

అన్నవరం, అక్టోబరు 2: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించారు. ప్రత్యేకపూజలు, జపములు అనంతరం పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను వనదుర్గ అర్చకులు కోట వంశీ, దేవులపల్లి ప్రకాష్, రాజశేఖర్ నిర్వహించారు.

వైభవంగా పైడితల్లి జాతర

పిఠాపురం, అక్టోబరు 2: పట్టణంలో పైడితల్లి అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. మంగాయామ్మరావుపేట, రామా థియేటర్ సెంటర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో అమ్మవార్ల ఆలయాల వద్ద జరిగిన జాతరకు భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. గరగనృత్యాలు, విచిత్ర వేషధారణలు, కోలాటనృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయాల పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తాళ్లరేవు, అక్టోబరు 2: చొల్లంగిపేట బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్ 19 విభాగంలో యోగా, త్రోబాల్, జూడో, షటిల్, ఫుట్‌బాల్ జిల్లాస్థాయి ఆటల పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె అభినందించారు.

నవోదయాకు ఎంపిక

సామర్లకోట, అక్టోబరు 2: మండలంలో జీ.మేడపాడు సంస్కృతి విద్యాలయానికి చెందిన మాదగని అవినాష్ పెద్దాపురం నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి అర్హత సాధించాడని ఎంఈవో వై.శివరామకృష్ణయ్య బుధవారం తెలిపారు. టీడీపీ తెలుగురైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాలకుర్తి రవిబాబు, ఆరిమిల్లి శిరీష్‌సతీష్, ప్రధానోపాధ్యాయులు నేమాల వీరవేణి అవినాష్‌ను అభినందించారు.

పోతులూరులో లిబరేషన్ ధర్నా

ప్రత్తిపాడు, అక్టోబరు 2: మండలంలోని పోతులూరులో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. పంచాయతీ పరిధిలో రహదారులు, డ్రైన్‌లు ఇతర అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని పంచాయతీ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఆందోళనలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, నాని, సుబ్బారావు, కామరాజు పాల్గొన్నారు.

ఉపవాస దీక్ష చేపట్టిన తుమ్మలపల్లి రమేష్

కిర్లంపూడి, అక్టోబరు 2: మండలంలోని సోమవరం గ్రామంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఉపవాస దీక్ష చేపట్టారు. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా తాను ఉపవాస దీక్ష చేశానని రమేష్ తెలిపారు. లలితా పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 200మందికి విష్ణు సహస్రనామ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాయుడు శ్రీను, గోకేడ ప్రసాద్, దొడ్డా శ్రీను, ఎడాలి రాంబాబు, పాలెం బాబీ, రేపూరి శ్రీనివాస్, బచ్చల రాజు, పట్నీరెడ్డి మణికంఠ, సూరి పాల్గొన్నారు.

గొల్లప్రోలులో నగర సంకీర్తన

గొల్లప్రోలు, అక్టోబరు 2: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన 11రోజుల ప్రాయశ్చిత్త దీక్ష విరమణ సందర్భంగా గొల్లప్రోలులో బుధవారం సాయంత్రం జనసేన నాయకులు నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజనలు, భజన బృందాలతో పురవీధుల్లో సాగింది. కార్యక్రమంలో జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

రావికంపాడులో ప్రత్యేక పూజలు

తొండంగి, అక్టోబరు 2: రావికంపాడులో బుధవారం గ్రామ ధర్మప్రచార సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి లడ్డూ వివాదం నేపథ్యంలో ప్రాయశ్చిత్తం జరగాలంటూ భక్తులంతా నగర సంకీర్తన జరిపారు. సీతారాముల మూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. సిద్దా రాంబాబు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

పెద్దాపురం, అక్టోబరు 2: మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీమ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో 150మంది గర్భిణులకు పౌష్టికాహారాన్ని జవహర్‌లాల్ మున్సిపల్ హైస్కూల్ 2011-12పదోతరగతి విద్యార్థులు అందించారని టీమ్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ తెలిపారు.